వన మహోత్సవం విజయవంతం చేయాలి

- నాటిన ప్రతి మొక్కకు లెక్క ఉండాలి
- మంత్రి ధనసరి అనసూయ

ములుగు రూరల్, జూలై 7 : వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించే బాధ్యతలను చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు మండలంలోని జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం వన మహోత్సవం నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ టీఎస్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎఫ్ఓ రాహుల్‌కిషన్ జాదవ్‌తో కలిసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గతంతో పోల్చితే తక్కువ మొక్కలు నాటినప్పటికీ వాటిని 100 శాతం సంరక్షించాలన్నారు. జాతీయ రహదారి, తొంగలు, వాగులకు ఇరువైపులా అవసరమైన మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. జిల్లాలో నాటుతున్న మొక్కలు, పంపిణీ చేస్తున్న మొక్కల ఆడిట్ నిర్వహించాలన్నారు.రెగ్యులర్‌గా సర్వే నిర్వహిస్తూ మొక్కల స్థితిగతులను తెలుసుకోవాలని ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కకు లెక్క ఉండాలన్నారు. ప్రతి కార్యక్రమాన్ని అధికారులు జవాబుదారీతనంతో పూర్తి చేయాలన్నారు. ములుగు జిల్లాలో వర్షపు నీటిని నిల్వ చేయడం కోసం చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు

ములుగు రూరల్ : జాకారం హాస్టల్‌లో మొక్కను నాటుతున్న మంత్రి సీతక్క

నిర్మించాలన్నారు. ప్రజలు అడవులను ఎట్టి పరిస్థితుల్లో నరకవద్దని, ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచేందుకే కృషి చేయాలని కోరారు. త్వరలోనే మల్లంపల్లి మండలం ఏర్పాటు, ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ టీఎస్ దివాకర మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 13.40 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించామని, 100 శాతం మొక్కల సంరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద 3 వేల మొక్కలు, బ్లాక్ ప్లాంటేషన్ కింద 6 లక్షల మొక్కలు ఇండ్లకు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో విద్యారాణి, డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఎంపీడీవో రామకృష్ణ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పలువురికి మంజూరైన చెక్కులను మంత్రి సీతక్క జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.

లక్నవరంలో తూము లీకేజీ పనుల పరిశీలన

గోవిందరావుపేట : లక్నవరం చెరువు కింద రైతులు రెండు పంటలు పండించేలా కృషి చేస్తానని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మండలంలోని లక్నవరం సరస్సు తూము లీకేజీల మరమ్మతు పనులను రూ.2లక్షల వ్యయంతో పూర్తి చేశారు. కాగా, ఆ పనులను పరిశీలించేందుకు మంత్రి ఆదివారం సాయంత్రం లక్నవరం వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల రైతాంగానికి లక్నవరం సరస్సు కల్పతరువు అన్నారు. అలాంటి సరస్సు కాల్వల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి, ఏటా రెండు పంటలకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే, లక్నవరం సరస్సులోకి దేవాదుల నీటిని మళ్లిస్తామని చెప్పారు. ఆమె వెంట డీఈ శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా సీఐ రవీందర్ ఆధ్వర్యంలో ఎస్సై కమలాకర్ భారీ బందోబస్తు నిర్వహించారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

- బావిలో కిరాణా షాపు యజమాని మృతదేహం
- తులం బంగారం, రూ.50 వేల నగదు అపహరణ

ఎస్‌కే రహీం (ఫైల్)

నర్సంపేట రూరల్, జూలై 7: అనుమానాస్పదంగా కిరాణా షాపు యజమాని మృతి చెందిన ఘటన నర్సంపేట పట్టణం సర్వాపురం ఇందిరమ్మకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌కే రహీం (44)-షహేదా దంపతులు స్థానికంగా కిరాణం, బెల్ట్‌షాపు నడుపుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ నెల 1న షహేదా తన కుమారుడు రషీద్ ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఖమ్మం జిల్లాలోని సోదరుడి ఇంటికి వెళ్లి అక్కడి దవాఖానలో ఆపరేషన్ చేయించింది. కాగా, ఆదివారం రహీం ఇంటి ముందు ఉన్న బావి నుంచి దుర్వాసన రావడాన్ని చుట్టుపక్కల వారు గమనించి తల్లి, కుమారుడికి విషయం చేరవేశారు. వారు వచ్చి స్థానికుల సహాయంతో బావిలో చూడగా రహీం మృత దేహం లభ్యమైంది. ఇంట్లోని వస్తువులు చిందరవందరంగా ఉండగా, సమాచారం అందు కున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. బావి నుంచి మృతదే హాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు తండ్రి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ కుమారుడు రషీద్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా ఇంట్లో ఉన్న తులం బంగారం, 2 తులాల వెండి, రూ.50వేల నగదు అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు కొట్టి బావిలో పడేసినట్లు కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పాముకాటుతో చిన్నారి మృతి

మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

వెంకటాపురం (నూగూరు), జూలై 7 : మండల పరిధిలోని శాంతి నగర్‌లో ఓ బాలిక పాము కాటుతో ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన తాటి కావ్యశ్రీ (12) (చిరుతపల్లి ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని) శనివారం రాత్రి ఇంట్లో నేలపై పడుకొని నిద్రిస్తోంది. ఈ క్రమంలో అటుగా వచ్చి కట్ల పాము కాటేసింది. దీంతో బాలిక అరవడంతో మేల్కొన తల్లిదండ్రులు పామును చూసి చంపేశారు. అనంతరం బాలికను దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కోర్టు ఆర్డర్ ధిక్కరిస్తున్న రెవెన్యూ అధికారులు

న్యాయం చేయాలని బాధిత మహిళ వేడుకోలు

విలేకరులతో మాట్లాడుతున్న బత్తోజు పద్మ

ములుగు, జూలై 7 (నమస్తే తెలంగాణ) : పట్టాదారు నుంచి కొనుగోలు చేసిన భూమికి పట్టా జారీ చేయడంలో అధికారులు అలసత్వం వహించడంతో హైకోర్టును ఆశ్రయించగా న్యాయ స్థానం ఇచ్చిన ఆర్డర్‌ను సైతం ములుగు మండల రెవెన్యూ అధికారులు ధిక్కరిస్తున్నారని మల్లంపల్లి గ్రామానికి చెందిన బత్తోజు పద్మా నర్సింహస్వామి ఆరోపించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2004లో ఏసునగర్ గ్రామంలో ఎలగందుల సోమయ్య, పెండెం హేమాద్రి, వెంకటేశ్వర్లు, వీరసోములకు చెందిన సర్వే నంబర్ 220/4లో 19 ఎకరాల 10 గుంటల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. పట్టా జారీ చేసే క్రమంలో గ్రామానికి చెందిన కొందరు కోర్టులో 2009లో కేసు వేయగా హైకోర్టు 2024 ఏప్రిల్‌లో తమకు అనుకూలంగా తీర్పు వెలువరించిందని చెప్పారు. హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను రెవెన్యూ అధికారులకు చూపించి పట్టా చేయమని కోరగా అధికారులు దాన్ని సైతం లెక్క చేయకుండా అడిగిన ప్రతిసారీ ఏదో కారణం చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి, తమ భూమికి పట్టా పాస్ పుస్తకం అందించాలని పద్మ వేడుకున్నారు.

చెర వీడి.. స్వదేశం చేరి..

- కాంబోడియా నుంచి భారత్‌కు వచ్చిన ప్రకాశ్
- ఉద్యోగం పేరుతో మోసపోయి సైబర్ నేరగాళ్ల చెరలో చిత్రహింసలు
- పోలీసులు, మాజీ ఎంపీ కవిత చొరవతో క్షేమంగా రాక

కాంబోడియా నుంచి ఢిల్లీకి చేరుకున్న ప్రకాశ్

బయ్యారం, జూలై 7: ఉద్యోగం పేరుతో మోసపోయి సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి చిత్రహింసలు అనుభవించిన మున్సిఫ్ ప్రకాశ్ ఎట్టకేలకు స్వదేశానికి చేరుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన మున్సిఫ్ ప్రకాశ్ బీటెక్ పూర్తి చేసి మూడేళ్లు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఉద్యోగం కోసం గత మార్చి 8న ఆస్ట్రేలియాకు వెళ్లాడు. ఏజెన్సీ వారు ముందు చెప్పినట్లుగా ఆస్ట్రేలియాకు కాకుండా మలేషియా దేశానికి తీసుకెళ్లారు. రెండు నెలలు అక్కడే ఉన్నాడు. అనంతరం కాంబోడియా దేశానికి తీసుకెళ్లారు. అక్కడ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొని చిత్రహింసలు అనుభవించాడు. తనను చీకటి గదిలో నిర్బంధించి, మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఫోన్ చేసి కుటుంబసభ్యులకు తెలిపాడు. వీడియోలను కుటుంబ సభ్యులు, స్నేహితులకు పంపగా గత మే 27న అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంత్ స్పందించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ప్రకాశ్ విషయంపై ఆరా తీసిశారు. ప్రకాశ్ ఇండియన్ ఎంబసీ అధికారుల ఆధీనంలో క్షేమంగా ఉన్నట్లు తెలియడంతో స్థానిక సీఐ రవికుమార్ ద్వారా కుటుంబసభ్యులకు తెలియపరిచి భరోసా కల్పించారు. ప్రకాశ్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ క్రమంలోనే ప్రకాశ్ విషయం మీడియా ద్వారా తెలుసుకున్న మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత వెంటనే స్పందించారు. కాంబోడియా దేశంలో ఉన్న తన మిత్రుడు కిరణ్‌రెడ్డికి విషయం చెప్పి, ప్రకాశ్ స్వదేశానికి వచ్చేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. అధైర్యపడొద్దని ప్రకాశ్‌కు భరోసా కల్పించారు. ఈ నేపథ్యంలో కవిత చొరవ కారణంగా ప్రకాశ్ శనివారం రాత్రి కాంబోడియా దేశం నుంచి విమానంలో స్వదేశానికి చేరుకున్నాడు. వైద్య పరీక్షలు, మూడు రోజుల అబ్జర్వేషన్ తర్వాత ఢిల్లీ పోలీసులు ప్రకాశ్‌ను ఇంటికి పంపించనున్నట్లు సమాచారం. అయితే ప్రకాశ్ స్వదేశానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చశారు. కాంబోడియా దేశంలో సైబర్ నేరగాళ్ల చెర నుంచి ప్రాణాలతో బయటపడి స్వదేశానికి తిరిగి వచ్చిన ప్రకాశ్ సెల్ఫీ వీడియో ద్వారా మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

సింగరేణిలో కలర్ కార్డుల విధానాన్ని రద్దు చేయాలి

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

భూపాలపల్లి రూరల్, జూలై 7 : సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులకు ఎల్లో, రెడ్ కార్డులు జారీ చేస్తున్న విధానాన్ని వెంటనే బేషరతుగా ఉపసంహరించుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజ్ కుమార్ మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లు చేయకున్నా సింగరేణి యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డులను జారీ చేస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తోందని ఆరోపించారు. ఎలాంటి సమాచారం లేకుండా కార్మిక సంఘాలతో చర్చించకుండా ఇలా కార్డుల విధానాన్ని ప్రవేశపెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్డుల జారీలో ఎలాంటి విధివిధానాలు ప్రకటించకుండానే సింగరేణిలో అమలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా సింగరేణిలో అమలు చేస్తున్న ఎల్లో, రెడ్ కార్డులను తక్షణమే యాజమాన్యం రద్దు చేయాలని, లేకుంటే ఈ నెల 19న జరిగే సింగరేణి ఉన్నత స్థాయి త్రైపాక్షిక సమావేశంలో దీనిపై చర్చించి, పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, గురుజేపల్లి సుధాకర్‌రెడ్డి, మధుగాని విజేందర్, తాళ్ల పోషం, ఎస్ఆర్, ఎంఎస్‌జే మురళి, అఖిల్, ప్రసన్నకుమార్, సాధిక్, కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.

కారు కొంటారా?

నేడు కారు ప్రతి ఒక్కరికీ అవసరంగా మారుతున్నది. నిజంగా చెప్పాలంటే కారు కొనేందుకున్న అవకాశాలూ అందరికీ పెరిగిపోయాయిప్పుడు. చాలామంది ఆర్థిక స్థోమత బలపడటంతో కార్ల అమ్మకాలూ జోరుగా సాగుతున్నాయి. అయితే కారు అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. సొంతింటి తర్వాత చాలా మంది కల కారు కొనుగోలేననడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే కారు కొనుగోలులో తెలివిగా వ్యవహరించండి.



ఇవి చేయండి

బడ్జెట్ వేసుకోవాలి

కారు కొనాలన్న ఆలోచన రాగానే ముందుగా బడ్జెట్ సెట్ చేసుకోండి. దీనివల్ల మీ కష్టార్జితం వృథా కాకుండా జాగ్రత్త పడవచ్చు. స్థోమతకు మించిన ఖర్చులకెళ్లడం లేనిపోని కష్టాలనే తెచ్చిపెడుతుంది. ఇక కారుకు చెల్లించే అధిక ధర.. బీమా, చెల్లించే వడ్డీలను ప్రభావితం చేయగలదని మర్చిపోవద్దు.

ఫీచర్లు చూడాలి

ఒకప్పుడు కారు అంటే.. కేవలం ప్రయాణ సాధనమే. కానీ ఇప్పుడు అంతకు మించేనని చెప్పవచ్చు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేడు వస్తున్న కార్లలో ఎన్నో ఫీచర్లుంటున్నాయి. కాబట్టి రకరకాల కంపెనీలు తెస్తున్న కార్ల గురించి, వాటిలోని ఫీచర్ల గురించి పూర్తిగా తెలుసుకొని మార్కెట్‌లోకి అడుగు పెట్టండి. ఇందుకోసం సంప్రదాయ, ఆన్‌లైన్ వేదికలను వాడుకోండి.

టెస్ట్ డ్రైవ్ చేయాలి

మీరు ఎంచుకున్న బడ్జెట్‌లో వస్తున్న ప్రతీ కారునూ టెస్ట్ డ్రైవ్ చేయండి. అప్పుడే మీకు సౌకర్యవంతమైన వాహనాన్ని సొంతం చేసుకోగలరు. అంతేగాక టెస్ట్ డ్రైవ్‌లో రకరకాల రోడ్లపై కారు ఎలా ప్రయాణిస్తున్నది, లోపల కూర్చున్నవారికి ఎలా అనిపిస్తున్నది? అన్నదానిపైనా అవగాహన వస్తుంది. కారులోని లోపాలనూ గుర్తించవచ్చు.

ఫైనాన్స్‌కు వెళ్తే..

నేరుగా నగదు కంటే ఫైనాన్స్ ద్వారా కారు కొనేవారే ఎక్కువ. మీరూ ఆ దారిలోనే వెళ్లాలనుకుంటే ఏయే బ్యాంకుల్లో వాహన రుణాలపై ఎంతెంత వడ్డీరేట్లున్నాయి? ఇతర చార్జీల మాటేంటి అన్నది ఆరా తీయండి.

ఏం చేయాలి.. ఏం చేయొద్దు

ఇవి గుర్తుంచుకోండి

✓మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ కార్ల మాడళ్లను, వాటి ధరలను, రుణ సదుపాయాలను పూర్తిగా పరిశీలించండి.

✓మీ బడ్జెట్‌కు తగ్గ కారు దొరికేదాకా వెతకండి. ధరతోపాటు నిర్వహణ, బీమా, ఇతరత్రా వ్యయాలనూ దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోండి.

✓తుది నిర్ణయం తీసుకొనే ముందు టెస్ట్ డ్రైవ్‌కు సమయం తీసుకోవాలి. ఆపైనే కారు కొనుగోలుకు వెళ్లడం ఉత్తమం.

✓కారును కొనే ప్రక్రియలో మీపై ఏవైనా తెలియని చార్జీల భారం ఉంటున్నదా? అని గమనించండి. అనవసరంగా ఏ సర్వీసునూ తీసుకోవద్దు.

✓సంతకాలు పెట్టే ముందు ఒకటికి రెండు సార్లు డాక్యుమెంట్లను పూర్తిగా చదవండి. ఫైనాన్స్, లీజ్ అగ్రిమెంట్ల నియమనిబంధనలను, షరతులను తెలుసుకోండి.

ఇవి చేయకండి

తొందరపడి..

కారును చూసో.. ఆయా సంస్థలు, డీలర్లిచ్చే ఆఫర్లకు ఆకర్షితులయ్యో.. ఎవరి బలవంతంతోనో.. కొనేందుకు బయలుదేరవద్దు. కుటుంబ సభ్యులతో చర్చించి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే ఓ నిర్ణయానికి రావాలి. అప్పుడే ఎల్లవేళలా మీకు వారి మద్దతుంటుంది.

ఎక్కువ ఈఎంఐలు వద్దు

రుణ వాయిదాలను పెంచుకుంటే మీపై భారం తగ్గుతుందని డీలర్లు చెప్తే దాన్ని నమ్మవద్దు. ఎందుకంటే ఈఎంఐలు పెరిగితే మీపై వడ్డీ భారం పెరుగుతుంది. కాబట్టి ఈఎంఐ ఎక్కువైనా.. వీలైనంత త్వరగా రుణ విముక్తులయ్యేందుకే మొగ్గు చూపండి. డౌన్ పేమెంట్ ఎక్కువగా కడితే రిలీఫ్‌గా ఉంటుంది.

ఊ కొట్టొద్దు

చెప్పిన ధరకే కాకుండా డీలర్లతో ఇంకా రేటు తగ్గేదాకా సంప్రదింపులు జరుపండి. డాక్యుమెంటేషన్, డెస్టినేషన్ చార్జీలు, పన్నులు, ఇతరత్రా ఫీజుల గురించి తెలుసుకొని, వాటిని వీలైనంత వరకు దూరం చేసుకునేలా మాట్లాడండి. బెటర్ డీల్‌కు ప్రయత్నించండి. కారు కొన్న తర్వాత అదనపు యాక్సరీస్ బిగించుకోవడంలోనూ జాగ్రత్త వహించి అవసరమైతేనే ముందుకెళ్లండి.

పాత కారు విషయంలో..

మీకు పాత కారు ఉంటే దాన్ని అమ్మే విషయంలో తొందరపడవద్దు. ఎక్కువ ధర వస్తున్నదని అమ్ముకుంటే.. కొత్త కారు విషయంలో ఏదైనా తేడా కొడితే అనవసరపు ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

రాబడి

గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు ఈ నెలాఖరే (జూలై 31). అయితే కొత్త పన్ను విధానంలో అనేక మార్పులొచ్చాయి. కాబట్టి వాటిని గుర్తుంచుకుంటే మంచిది.

ఈ మార్పులు తెలుసా?

- *2023-24 మొదలు కొత్త పన్ను విధానం డీఫాల్ట్ హోదాను అందుకున్నది. కనుక పన్ను మినహాయింపులను ఆశించే వేతన జీవులు వారి కంపెనీ యాజమాన్యాలకు పాత పన్ను విధానాన్ని కోరుకుంటున్నట్టు తెలియపర్చాలి. లేకపోతే కొత్త పన్ను విధానం పరిధిలో మీకు పన్ను రేట్లు వర్తిస్తాయి.*
- *కొత్త విధానంలో రిబేటు పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెరిగింది. మీకు వార్షిక వేతనం రూ.7.5 లక్షలున్నా పన్ను కట్టనక్కర్లేదు. స్టాండర్డ్ డిడక్షన్ మరో రూ.50,000 ఉండటమే కారణం. పెన్షనర్లకూ ఈ ప్రయోజనం ఉంటుంది.*
- *కొత్త పన్ను విధానాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు ఐటీ స్లాబులను 6 నుంచి 5కు తగ్గించారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా పన్నుండదు. రూ.3-6 లక్షల మధ్య 5%, రూ.6-9 లక్షల మధ్య 10 %, రూ.9-12 లక్షల మధ్య 15 %, రూ.12-15 లక్షల మధ్య 20 %, రూ.15 లక్షలు దాటితే 30 % పన్నుంటుంది.*

పీపీఎఫ్ ఖాతా లాభాలివే..

పొదుపునకు, దీర్ఘ కాలిక మదుపునకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) చక్కని సాధనం. పన్ను ప్రయోజనాలను కల్పిస్తూ వ్యక్తుల ఆదాయ వృద్ధికి దోహదం చేస్తుంది. పీపీఎఫ్ వడ్డీరేట్లను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. 3 నెలలకోసారి సమీక్ష జరుగుతుంది. ప్రస్తుత వార్షిక వడ్డీరేటు 7.1 శాతం. కనీసం 15 ఏండ్ల లాకిన్ పీరియడ్‌తో ఐదేండ్లు నిరవధికంగా ఖాతాను పొడిగించుకోవచ్చు. ఈ ఖాతా లాభాలను పరిశీలిస్తే..

అధిక వడ్డీరేట్లు

పీపీఎఫ్‌లో వడ్డీరేట్లు సాధారణంగా 7-8 శాతంగా ఉంటాయి. సేవింగ్స్ ఖాతా వడ్డీరేటు 3-4 శాతమే. అందుకే పీపీఎఫ్ ఖాతాలు ఆకర్షణీయంగా మారాయి.

పన్ను ప్రయోజనాలు

ఖాతాలో జమయ్యే మొత్తాలతోపాటు వాటిపై పొందే వడ్డీ ఆదాయానికీ ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులుంటాయి. ప్రతీ ఆర్థిక సంవత్సరం తమ పీపీఎఫ్‌కు ఖాతాదారులు రూ.500కు తగ్గకుండా, రూ.1.5 లక్షలకు మించకుండా జమ చేసుకోవచ్చు.

సురక్షిత పెట్టుబడి

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకమే పీపీఎఫ్. కాబట్టి ఇదో సురక్షిత పెట్టుబడి. కచ్చితమైన, స్థిరమైన రాబడులుంటాయి. స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులకున్న రిస్క్ ఇక్కడ ఉండదు.

రుణ సౌకర్యం

ఖాతాదారులు తమ ఖాతాలో ఉన్న నిల్వల్లో 25 శాతం వరకు రుణంగా తీసుకోవచ్చు. ఖాతా తెరిచిన ఐదేండ్ల తర్వాత కొద్ది కొద్దిగా (బ్యాలెన్స్‌లో 50 శాతం వరకు) నగదునూ ఉపసంహరించుకోవచ్చు.

పీపీఎఫ్ ఖాతాకు ఎవరు అర్హులు?

✓భారతీయ పౌరులై ఉండాలి.

✓ఖాతాను కేవలం ఒక్కసారే తెరవగలం.

✓మేజర్లు అయ్యేదాకా మైనర్ల పేరిట వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పీపీఎఫ్ ఖాతా తెరిచి నిర్వహించవచ్చు.

ఏయే పత్రాలు కావాలి?

✓ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తదితర కేవైసీ ధ్రువీకరణలు.

✓ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు.

✓అకౌంట్ తెరిచే ఫారం.

✓నామినీ వివరాలు.

ఖాతాను ఎలా తెరవాలి?

✓ప్రధాన బ్యాంకులన్నింటిలో ఈ ఖాతా సౌకర్యం ఉంటుంది.

✓బ్యాంక్ వెబ్‌సైట్ లేదా మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లోకి లాగిన్ అవ్వాలి.

✓'ఓపెన్ ఏ పీపీఎఫ్ అకౌంట్' ట్యాబ్‌ను ఎంచుకోవాలి.

✓మైనర్ల కోసం అయితే 'మైనర్ అకౌంట్', మీ కోసమే అయితే 'సెల్ఫ్ అకౌంట్'ను ఎంచుకోవాలి.

✓ఆపై అడిగిన వివరాలన్నీ దరఖాస్తు ఫారంలో నింపి సరిచూసుకోవాలి.

✓ప్రతీ ఆర్థిక సంవత్సరం మీరు డిపాజిట్ చేసే మొత్తాన్ని పేర్కొనాలి.

✓పీపీఎఫ్ ఖాతాలోకి మీ సేవింగ్స్ ఖాతా నుంచి డిపాజిట్లు వెళ్లేందుకు అనుమతులివ్వాలి.

✓ఓటీపీని పొందేందుకు మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేయాలి.

✓ఓటీపీని ఎంటర్ చేసి ధ్రువీకరించుకోవాలి.

✓ఆపై మీ ఖాతా మొదలవుతుంది. ఈ సమాచారం మీకు ఫోన్ మెసేజ్ లేదా ఈ-మెయిల్ ద్వారా వస్తుంది.

ఆటుపోట్లకు అవకాశం

మార్కెట్ పల్స్

గత వారం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లలో రికార్డుల మోత మోగింది. సూచీలు జీవన కాల గరిష్ఠాల వద్ద ఉన్నా.. మదుపరులు పెట్టుబడులకే ఆసక్తి కనబర్చారు. అక్కడక్కడా అమ్మకాల ఒత్తిళ్లకు లోనైనా.. ఓవరాల్‌గా మాత్రం కొనుగోళ్లతో కదం తొక్కారు. దీంతో ఈక్విటీ మార్కెట్లు నయా ఆల్‌టైమ్ హైలను సృష్టించాయి. ఫలితంగానే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 963.87 పాయింట్లు ఎగిసి 80 వేలకు కూతవేటు దూరంలో 79,996.60 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 313.25 పాయింట్లు ఎగబాకి 24వేల స్థాయికి ఎగువన 24,323.85 దగ్గర నిలిచింది. నిజానికి సెన్సెక్స్ తొలిసారి 80 వేలను దాటిపోయింది. నిఫ్టీ కూడా 24,400 పాయింట్లను అధిగమించింది. అయితే మదుపరులు లాభాల స్వీకరణ వైపు నడిచారు. దీంతో ఈ చారిత్రక స్థాయిల్లో సూచీలు నిలబడలేకపోయాయి. ఈ క్రమంలో ఈ వారం మదుపరులు పెట్టుబడులు, అమ్మకాల నడుమ ఊగిసలాటకు గురికావచ్చన్న అంచనాలున్నాయి. అందుకే సూచీల ఆటుపోట్లకు అవకాశాలున్నాయని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.